సాక్షి
వరంగల్
సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



నల్లతామరతో నష్టం

మిరప పంటలో ఎర్రనల్లి, నల్ల తామర పురుగుల నివారణకు చర్యలు చేపట్టాలని ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్తలు తెలిపారు.

- 8లో▸



స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ పదవి ఖాళీ

కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీగా జువాలజీ విభాగం ప్రొఫెసర్ వెంకయ్య పదవీకాలం ముగిసింది. దీంతో ఆ స్థానంలో ఎవరిని నియమిస్తారోనని ఆసక్తిగా మారింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
35⁰/19⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి చలిగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

స్థానిక పోరుకు కసరత్తు

- సర్పంచ్ ఎన్నికలకు సిద్ధమవుతున్న యంత్రాంగం
- ఎంపీడీఓ కార్యాలయాలకు చేరుతున్న సామగ్రి
- జిల్లాలో 11 గ్రామీణ మండలాలు.. 317 గ్రామ పంచాయతీలు
- 2,754 వార్డులు.. 3,83,114 మంది ఓటర్లు
- రిజర్వేషన్ల కోసం ఆశావహుల ఎదురు చూపులు



సంగెం గ్రామపంచాయతీ కార్యాలయం

సంగెం: స్థానిక సమరానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల బీసీ కుల గణన పూర్తి కావడం, ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం, తర్వాత కేబినెట్‌లో బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుంటారనే సమాచారంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. పోటీ చేసేందుకు యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నది. ప్రభుత్వం ప్రకటించనున్న రిజర్వేషన్ల వైపు ఆశగా చూస్తున్నారు. రాజకీయాలపై ఆసక్తి ఉన్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. పల్లెల్లో జోరుగా రచ్చబండ వేదికగా చర్చలు నడుస్తున్నాయి. సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు ఇప్పటికే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రజల మద్దతు కూడగడుతున్నారు. ఫలానా వ్యక్తులు పోటీ చేసేందుకు ముందుకు వస్తున్నారని పేర్లు సైతం వినిపిస్తున్నాయి. జిల్లాలోని 11 గ్రామీణ మండలాల్లో 317 గ్రామపంచాయతీలు, 2,754 వార్డులు ఉన్నాయి. మొతం ఓటర్లు 3,83,114 మంది ఉండగా.. వీరిలో మహిళలు 1,95,067, పురుషులు, 1,88,047, ఇతరులు 10 మంది ఉన్నారు.

ప్రధాన పార్టీల్లో పోటాపోటీ

అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ నుంచి సర్పంచ్ స్థానానికి పోటీ చేయాలని ఆశిస్తున్న వారి సంఖ్య భారీగానే ఉంది. ప్రధానంగా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించిన నాయకులు టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీలోకి వలసలు పెద్ద ఎత్తున పెరిగాయి. వివిధ పార్టీల్లో గతంలో ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు తిరిగి తమ పదవులు దక్కించుకోవాలని వలస బాట పట్టారు. వీరికి తోడు కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉండి ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి 10 ఏళ్లుగా వేచి చూసినవారు సైతం పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నవారు సైతం తమ స్థానాలను కాపాడుకునేందుకు, పట్టు నిలుపుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.



సంగెం ఎంపీడీఓ కార్యాలయంలో దిగుమతి అవుతున్న ఎన్నికల సామగ్రి (ఫైల్)

ప్రజలతో మమేకం..

స్థానిక సమరంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రాజకీయ వారసులతోపాటు గతంలో ప్రత్యక్ష రాజకీయాల్లోని లేనివారు సైతం రాజకీయ అరంగేట్రం చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ వేగవంతం కావడంతో ఆశావహుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ఇక రిజర్వేషన్ల ఖరారు చేసి ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపగానే బరిలోకి దూకేందుకు అవసరమైన అంగబలం, అర్థబలం సమకూర్చుకుంటున్నట్లు సమాచారం. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమే అన్న చందంగా నిత్యం ప్రజల్లో తిరుగుతున్నారు. గ్రామాల్లో శుభ, అశుభ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆపద వచ్చినప్పుడు దగ్గరుండి పనులు చక్కబెడుతున్నారు. అంతేకాకుండా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని ఫోన్లలో పలకరిస్తున్నారు. వారి యోగక్షేమాలు అడుగుతూ మద్దతు కూడగట్టుకుంటున్నారు.

నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా సిద్ధం..

నోటిఫికేన్ ఎప్పుడు వచ్చినా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే వార్డుల విభజన చేసి, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించారు. పోలింగ్ కేంద్రాలను ప్రకటించారు. అవసరమైన పోలింగ్ బాక్సులను సిద్ధం చేశారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రారంభించారు. ఎన్నికల సామగ్రి సైతం మండల పరిషత్ కార్యాలయాలకు చేరుకుంటోంది. పీఓ, ఏపీఓల జాబితాలను సిద్ధం చేస్తున్నారు.

రిజర్వేషన్లు ప్రకటించడమే తరువాయి..

సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించేందుకు వార్డుల విభజన పూర్తి చేశాం. వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రకటించి, పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. ఎన్నికల సామగ్రి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుంది. రిజర్వేషన్లు ప్రకటిస్తే ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం.

- కొమురయ్య, సంగెం మండల పంచాయతీ అధికారి

దమ్ముంటే బీసీల ఓట్లు వద్దని చెప్పండి

- జీసీ రాజకీయ 'యుద్ధ భేరి' సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



సభలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న, వేదికపై ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ సారయ్య తదితరులు

'మా బీసీలకు మీ ఓట్లు వద్దు.. దమ్ముంటే బీసీల ఓట్లు మీకొద్దని చెప్పండి' అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన 'బీసీ రాజకీయ యుద్ధ భేరి' సభకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తదితరులు హాజరయ్యారు.

- వివరాలు 8లో▸

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామికి పూజలు

గీసుకొండ: మండలంలోని కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి తమ ఇంటి ఇలవేల్పని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఆదివారం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో పరకాల నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధిపై స్థానిక నాయకులతో చర్చించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. సందర్శనకు వచ్చిన చిన్నారులతో ఆయన ఫొటో దిగారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఫణీంద్ర, విష్ణు, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, అధికార ప్రతినిధి చాడ కొమురా రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, ఏనుమాముల మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల రుద్రప్రసాద్, మాజీ ఎంపీటీసీ గోపాల్, నాయకులు ఈర్ల ప్రవీణ్, మంద రమేశ్, జక్కుల రవి, సురేశ్, రమేశ్, జావేద్, జక్కుల సరిత, బోగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

మద్యం మత్తులో యువకుల వీరంగం

- అడ్డుకున్న పోలీసులపై దాడి
- ఇద్దరిపై కేసు నమోదు

నెక్కొండ: మద్యం మత్తులో ఇద్దరు యువకులు వీరంగం సృష్టించి, గొడవకు దిగిన సంఘటన నెక్కొండ పట్టణంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనర్సింహా వైన్ షాపు సమీపంలో దుగ్గొండి మండలం నాచినపల్లికి చెందిన జెట్టి రాజు, ఉల్లేరావు ప్రణీత్ మద్యం సేవించారు. ఈ క్రమంలో మండలంలోని సాయిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆటోను వారు అడ్డగించారు. డ్రైవర్ రాపాక ధనమంత్రితో గొడవకు దిగారు. దీంతో స్థానికులు 100కు డయల్ చేయగా.. కానిస్టేబుల్ లక్ష్మయ్, హోంగార్డు చిమ్మనాయక్ అక్కడికి చేరుకున్నారు. గొడవను పోలీసులు అదుపుచేస్తున్న క్రమంలో మద్యం మత్తులో ఆ యువకులు వారితో వాగ్వాదం చేసి దాడికి దిగారు. పోలీసుల వద్ద ఉన్న ట్యాబ్‌ను లాక్కొని విధులను అడ్డుకున్నారు. అనంతరం పోలీసులు యువకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. విధులను అడ్డుకుని, ట్యాబ్ లాక్కున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.



యువకులను స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

రోడ్ల పనులు అడ్డుకోవడం సరికాదు

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం: రోడ్ల పనులు కాంగ్రెస్ అడ్డుకోవడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు తండాలకు వెళ్లే రోడ్లను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తండాలు, గ్రామాలకు లింకురోడ్లను మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. టెండర్లు పూర్తయి కంకరపోసిన రోడ్ల పనులను ప్రస్తుత ఎమ్మెల్యే మాధవరెడ్డి ముందుచూపు లేకుండా రద్దు చేయించారని చెప్పారు. కంకర రోడ్లతో అనేక మంది ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని ఆరోపించారు. రోడ్ల నిర్మాణ పనులు అడ్డుకున్న వారు గ్రామాల్లోకి ఏ ముఖం పెట్టుకుని వస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ స్వప్న, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



కంకరపోసిన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

వివాహిత అదృశ్యం

గీసుకొండ: వివాహిత అదృశ్యమైన ఘటన మనుగొండలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారావుపేటకు చెందిన గొరటోయిన (దేవ) అక్షరకు మనుగొండకు చెందిన దేవ నాగరాజుతో వివాహం జరిగింది. భార్యాభర్తలు తరచూ గొడవపడుతుండేవారు. వారిద్దరికీ పెద్ద మనుషులు పలుమార్లు నచ్చజెప్పారు. అక్షర ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి తిరిగి మనుగొండకు వెళ్లలేదు. ఆమె కోసం బంధువులు ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. అక్షర తండ్రి భాస్కర్ ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ సీఐ మహేందర్ తెలిపారు.

మెనూ పాటించకుంటే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

- కలెక్టర్ సత్యశారద
- నెక్కొండలో గురుకులాలు, హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ
- ఇద్దరు ప్రిన్సిపాళ్లు, వార్డెన్, పీఈటీకి నోటీసులు ఇవ్వాలని డీఈఓకు ఆదేశం

నెక్కొండ: గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో మెనూ పాటించకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ సత్య శారద హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని బాలికల టీజీ గురుకుల పాఠశాల /కళాశాల, పోస్ట్ మెట్రిక్ (బాలికలు/బాలుర) హాస్టళ్లు, పెద్దకొర్పోలు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వంట గదులు, డైనింగ్‌హాళ్లు, స్టోర్ రూంలను ఆమె పరిశీలించారు. ముందుగా టీజీ గురుకుల పాఠశాలలో కలెక్టర్ తనిఖీలు చేపట్టారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతుందా అని తెలుసుకున్నారు. అక్కడ మటన్‌తో భోజనం పెట్టలేదు. అసంపూర్తిగా రికార్డులు ఉండడంతో వార్డెన్ ధర్మపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అలాగే, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో కలెక్టర్ రాకను గమనించి సిబ్బంది మటన్ వండేందుకు ప్రయత్నించి, కుంటి సాకులు చెప్పేందుకు ప్రయత్నించడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటలు వండే సిబ్బంది పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ సూచించారు. ఫిర్యాదు పెట్టెలను స్వయంగా తెరిచి పరిశీలించారు. సమస్యలు ఉంటే విద్యార్థులు ఫిర్యాదు పెట్టెలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లోని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. టీజీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మమత, వార్డెన్ ధర్మ, కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపాల్ రజిత, పీఈటీ సమ్మక్కకు సంజాయిషీ నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జ్ఞానేశ్వర్‌ను ఆమె ఆదేశించారు. డీఈఓతో పూర్తిస్థాయిలో విచారణ చేయించి నివేదిక పంపాలని ఆదేశిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎస్సై మహేందర్, అధికారులు తదితరులు ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

వరంగల్: కలెక్టరేట్‌లో ప్రజావిజ్ఞప్తులు స్వీకరించేందుకు సోమవారం ఉదయం 11 గంటలకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించాలని ఆమె కోరారు.

హేమాచలుడికి పూజలు



దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలంలోని హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఆలయంలో నిర్వహించే స్వామివారి తిల తైలాభిషేకం పూజలో పాల్గొని స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని సంతానం కోసం స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని స్వీకరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆలయ అర్చకులు ఈశ్వర రామానుజదాస్ స్వామివారికి నువ్వులనూనెతో పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. భక్తులతో పూజారులు ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర వివరించారు.

న్యూస్‌రీల్

మొక్కలకు పుట్టిన రోజు వేడుకలు



హసన్‌పర్తి: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఆదివారం మొక్కలకు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. గతేడాది ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకని యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్, వరంగల్ ఆధ్వర్యాన నీడనిచ్చే, పండ్లు, పూల మొక్కలు సుమారు 350 నాటారు. ఏడాది పూర్తయిన సందర్భంగా వాటికి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. రిటైర్డ్ అటవీ అధికారి, యునైటెడ్ ఫోరం ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం మాట్లాడుతూ మొక్కలను సంరక్షించే విద్యార్థినులకు బహుమతులు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నగర పాలక ఉద్యానశాఖ అధికారి బి.రమేశ్, ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ కోశాధికారి సుధాకరస్వామి, కార్యవర్గ సభ్యులు నాగేశ్వర్‌రావు, వడుప్సా నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుతోట శాంతారాం కర్ణ పాల్గొన్నారు.

వరంగల్ కోటలో విదేశీయుల సందడి



ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటను ఆదివారం ఇంగ్లండ్ దేశస్తులు సందర్శించారు. శిల్పాల ప్రాంగణంలో నల్లరాతితో చెక్కిన శిల్ప కళాసంపదను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఖుష్‌మహల్‌కు చేరుకుని నిర్మాణ శైలిని పరిశీలించి మహా అద్భుతంగా ఉందని కొనియాడారు. అంతకు ముందుగా కాకతీయ చరిత్ర, విశిష్టత గురించి కోట గైడ్ రవియాదవ్ వారికి వివరించారు. సాయంత్రం టీజీటీడీసీ ఆధ్వర్యాన నిర్వహించిన సౌండ్, లైటింగ్‌షోను తిలకించారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సోషల్‌సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈనెల 15వ తేదీ వరకు ఉందని సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ టి.మనోహర్ తెలిపారు. ఎకనామిక్స్ విభాగంలో (మూడు), పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో(ఒకటి) అడ్మిషన్లకు అవకాశం ఉందని, ఫెల్లోషిప్స్ జేఆర్ఎఫ్, నెట్‌లో అర్హత కలిగిన వారు క్యాంపస్‌లోని డీన్ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

సాయిప్రీతమ్‌కు ఫిడే రేటింగ్



వరంగల్ స్పోర్ట్స్: కాజీపేటకు చెందిన సాయిప్రీతమ్ చెస్‌లో 1,547 అంతర్జాతీయ ఫిడే రేటింగ్‌ను సాధించాడు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని పెద్దాపురంలో నిర్వహించిన 13వ స్కూల్ గేమ్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ఉన్నతమైన రేటింగ్‌ను సాధించినట్లు కోచ్ కన్నా తెలిపారు. కాజీపేటకు చెందిన కవిత, కృష్ణమూర్తి దంపతుల కుమారుడు సాయిప్రీతమ్ ఫాతిమానగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు.

'కొత్తపొద్దు'లో తెలంగాణ జీవన సౌందర్యం



హన్మకొండ కల్చరల్: 'కొత్తపొద్దు కోసం' కవిత్వంలో తెలంగాణ జీవన సౌందర్యం కనిపిస్తున్నదని ప్రముఖ కవి, హైదరాబాద్ బుక్ ఫేయిర్ అధ్యక్షుడు యాకూబ్ అన్నారు. ఆదివారం తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యాన హనుమకొండలోని ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో కవయిత్రి గట్టు రాధికామోహన్ రచించిన 'కొత్తపొద్దు కోసం' కవితా సంపుటిని ఆవిష్కరించారు. ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవి యాకూబ్ మాట్లాడుతూ రచయిత సమాజంలోని ప్రతీఅంశాన్ని తన కవిత్వంలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. కవులు వీఆర్.విద్యార్థి, బిల్ల మహేందర్, పెల్లుట్ల రమాదేవి, పుప్పాల శ్రీరాం పాల్గొన్నారు.





క్యూలైన్‌లో వస్తున్న భక్తులు



సమ్మక్క గద్దె వద్ద కిక్కిరిసిన భక్తులు

ముందస్తు మొక్కులు

మేడారానికి తరలివచ్చిన భక్తులు

- గంటల మోతతో మార్మోగిన గద్దెల ప్రాంగణం
- పకడ్బందీగా పోలీసుల బందోబస్తు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఈఓ రాజేంద్రం

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం శ్రీసమ్మక్క సారలమ్మ మినీ జాతరకు ఇంకా 10 రోజు సమయమే ఉంది. వన దేవతలను దర్శించుకునేందుకు ఆదివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వాహనాల్లో చేరుకున్నారు. జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌ల కింద స్నానాలు చేసి అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని పూజలు చేసి కానుకలు సమర్పించారు. ఒక్కరోజే సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. దేవాదాయ శాఖ ఈఓ రాజేంద్రం భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టారు.

మొదలైన భక్తుల తాకిడి

ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు పూజారులు మినీజాతర నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తుగా వనదేవతల దర్శనానికి భక్తులు తరలివస్తున్నారు. ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యాన భారీ బందోబస్తు నిర్వహించారు.

మేడారంలో వైద్య సేవలు

డీఎంహెచ్ఓ గోపాల్‌రావు ఆదేశాల మేరకు మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం కొనసాగుతోంది. ఆదివారం శిబిరాన్ని తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆడెపు చిరంజీవి సందర్శించారు. భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర కేసులుంటే తాడ్వాయి పీహెచ్‌సీకి రెఫర్ చేయాలని ఆయన సూచించారు. డీపీఎంఓ సంజీవరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పనులు

మేడారంలో ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. జంపన్నవాగు వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాప్ నల్లాల పనులు ఇంకా కొనసాగుతుండడంతో ఆదివారం అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులు స్నానాల కోసం ఇబ్బందులు పడ్డారు. ప్రైవేట్ వ్యవసాయదారుల బోరింగ్ మోటార్ల వద్ద స్నానాల కోసం ఒక్కో భక్తుడు రూ.10 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొక్కుల అనంతరం మేడారం పరిసర ప్రాంతాల్లో భక్తులు వంటావార్పు కోసం విడిది చేశారు. భక్తులు ఉన్న ప్రదేశాల్లో తాగునీటి వసతి సౌకర్యాలు లేకపోవడంతో మినరల్ వాటర్ కొనుగోలు చేసి దాహం తీర్చుకోవడంతోపాటు వంటకు కూడా వినియోగించుకోవాల్సి వచ్చింది. ముందస్తుగా మేడారానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని మంత్రులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల జారీ చేసిన కొన్ని శాఖ అధికారుల్లో మార్పు కనిపించడం లేదు.



జంపన్నవాగులోని బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు చేస్తున్న భక్తులు

పెండ్యాల, హసన్‌పర్తి రైల్వే స్టేషన్లకు వై కేటగిరీ హెచ్‌ఆర్‌ఏ మంజూరు

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధి పెండ్యాల, హసన్‌పర్తి రైల్వేస్టేషన్లకు వై కేటగిరీ హౌస్ రెంట్ అలవెన్స్(హెచ్‌ఆర్‌ఏ) ఇచ్చేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ ఆదివారం తెలిపారు. ఆయా రైల్వే స్టేషన్లకు వై కేటగిరీ హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేయాలని జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు బచ్చలి శ్రీనివాస్, డివిజన్ సెక్రటరీ రవీందర్ మజ్దూర్ యూనియన్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్.శంకర్‌రావు, ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ కృషి ఫలితంగా రైల్వే బోర్డు ఆమోదించిందని రవీందర్ తెలిపారు. 2010 నుంచి మజ్దూర్ యూనియన్ జోనల్ కమిటీ సభ్యుడు, జమ్మికుంట బ్రాంచ్ నాయకుడు బచ్చలి శ్రీనివాస్ పోరాట ఫలితంగా రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు.

చిన్నారిపై వృద్ధుడి వికృత చేష్టలు

- పోక్సో కేసు నమోదు

బయ్యారం: ఇంట్లో ఒంటరిగా ఉన్న చిన్నారిపై ఓ వృద్ధుడు మద్యం మత్తులో వికృతచేష్టలకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధుడు పి.చెన్నయ్య తన ఇంటి సమీపంలో ఉండే చిన్నారులపై కొంతకాలంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయంపై స్థానికులు మందలించారు. అయినా తన ప్రవర్తన మార్చుకోవడం లేదు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న పది సంవత్సరాల చిన్నారిపై వికృత చేష్టలకు పాల్పడ్డాడు. దీంతో ఆ చిన్నారి తల్లిదండ్రులకు విషయం తెలుపగా వారు చెన్నయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగశాయిపేట రహదారిపై తప్పిపోయిన ఓ మూడేళ్ల బాలుడు ఏడుస్తూ స్థానికుల కంటపడ్డాడు. ఆ బాలుడి తల్లిదండ్రుల ఆచూకీ కోసం వారు ప్రయత్నించినా లభించలేదు. దీంతో మిల్స్‌కాలనీ పోలీసులకు బాబును అప్పగించగా, పోలీసులు విశ్వప్రయత్నం చేశారు. రాత్రి 9.30 గంటల సమయంలో రంగశాయిపేట మహంకాళి దేవాలయం సమీపంలో బాలుడి తల్లిదండ్రులు ముత్యాల యాకయ్య, శ్రావణి ఉన్నట్లు గుర్తించి బాలుడిని కానిస్టేబుల్ కుతుబ్ సురక్షితంగా అప్పగించారు. మధ్యాహ్నం రోడ్డుపై చేరిన బాలుడు తప్పిపోయాడు. అప్పుడే పనికివెళ్లి సాయంత్రం 6గంటలకు ఇంటికి చేరిన తల్లి శ్రావణికి బాబు కనిపించలేదు. రోడ్డుపై వెతుకుతున్న క్రమంలో పోలీసులకు బాలుడి తల్లి శ్రావణ తారసపడగా అప్పగించారు.

నల్లతామరతో నష్టం..

మిరప పంటను ఆశిస్తున్న ఎర్రనల్లి, నల్లతామర
- పురుగుల నివారణ చర్యలు పాటించాలి
- రైతులకు జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు నాగరాజు, ప్రశాంత్ సూచనలు

మహబూబాబాద్ రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఈ సీజన్‌లో రెండు లక్షల పైచిలుకు ఎకరాల్లో రైతులు మిర్చి పంట సాగు చేస్తున్నారు. తొలిదశలో ఏపుగా పెరిగినా డిసెంబర్ నుంచి పంటను విపరీతంగా ఎర్ర నల్లి, నల్ల తామర పురుగులు ఆశించి నష్టపరుస్తున్నాయి. ఈ పురుగుల నివారణకు చర్యలు చేపట్టాలని మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలోని కొండా లక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధి జేవీఆర్ ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్తలు నాగరాజు, ప్రశాంత్ తెలిపారు. ఈ మేరకు ఇటీవల మిరప తోటలు పరిశీలించి రైతులకు ఎర్రనల్లి, నల్ల తామర నివారణకు పలు సూచనలు చేశారు.

ఎర్రనల్లి (కింది ముడుత) ..

ఈ పురుగుల ఉధృతి వాతావరణం చల్లగా ఉన్నప్పుడు అంటే అక్టోబర్ నెలలో మొదలై జనవరి చివరి వరకు ఎక్కువ ఉంటుంది. పూత దశలో ఉధృతి ఎక్కువ ఉంటే పూతరాలి కాపు గణనీయంగా తగ్గుతుంది. ఇవి ఆకు అడుగు భాగాన చేరి రసం పీల్చడం వల్ల ఆకులు వెనుకకు ముడుచుకుని తిరగబడిన పడవ ఆకారంలో కనిపిస్తాయి. అందుకే దీనిని వెనుక ముడత లేదా కింది ముడత అంటారు. ముదురు ఆకులు కాడలు పొడవుగా సాగి ముదురు ఆకుపచ్చ రంగుతో పెలుసుగా ఉంటాయి.

నివారణ చర్యలు..

ఎర్రనల్లి నివారణకు ఎకరాకు ప్రాపార్గెట్ 57 శాతం ఇ.సి 600 మిల్లీ లీటర్లు లేదా స్పిరోమెసిఫెన్ 22.90 శాతం ఎస్సీ మిల్లీ లీటర్లు లేదా ఐసోసైక్లోసిరం 9.2శాతం 80 మిల్లీ లీటర్లు లేదా క్లోర్ ఫినా ఫైర్ 10శాతం ఎస్సీ 400 మిల్లీ లీటర్లు లేదా డయాఫెన్తియురాన్ 240 మిల్లీ లీటర్లు లేదా డయాఫెంథియురాన్ 30శాతంతోపాటు పైరిప్రాక్సీఫెన్ 8శాతం ఎస్సీ 400 మిల్లీ లీటర్లు లేదా ఏథియాన్ 50 శాతం ఎస్సీ 800 మిల్లీ లీటర్లు లేదా ఫిప్రోనిల్ 2.50శాతంతోపాటు ప్రాపర్ గేట్ 35శాతం ఎస్ఈ 800 మిల్లీ లీటర్లు లేదా ఫెన్ పైరాక్సీమేట్ 5శాతం ఎస్సీ 240 మిల్లీ లీటర్లు లేదా సయాన్ ట్రనిలిప్రోల్ 7.3శాతం 80 గ్రాములను లీటర్ నీటితో కలిపి డయఫెన్తియురాన్ 36 ఎస్సీ 40శాతం 250 మిల్లీ లీటర్లను ఎకరానికి పిచికారీ చేయాలి.



మిరప తోటను పరిశీలిస్తున్న హెచ్‌ఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు నాగరాజు, ప్రశాంత్



ఎర్రనల్లి సోకిన మిరప మొక్కలు



మిరప మొక్కలకు సోకిన నల్లతామర

తామర పురుగులు ఆశించడం వల్ల వచ్చే పైముడత తెగులు

మిరపలో తామర పురుగులు సోకిన ఆకులు ముడతలు పడతాయి. పైకిముడుచుకుంటాయి. పూల మొగ్గలు పెలుసుగా మారి రాలిపోతాయి. మొక్కల ఎదుగుదల, పూలు, కాయల ఉత్పత్తి కుంటుపడుతుంది. దీని నివారణకు ఫిప్రోనిల్ 80 శాతం డబ్ల్యూజీ 25 గ్రాములను ఎకరానికి లేదా టోల్ ఫిన్పైరాడ్ 15 శాతం ఈసీ 400 మిల్లీ లీటర్లను ఎకరానికి లేదా బ్రోప్లానిలైడ్ 25 మిల్లీ లీటర్లను ఎకరానికి లేదా ఫ్లక్సామెటమైడ్ 10 శాతం డబ్ల్యూ/డబ్ల్యూ ఈసీ 160 మిల్లీ లీటర్లను ఎకరానికి లేదా సియాంట్రనిలిప్రోల్ 10.26 శాతం ఓడీ 240 మిల్లీ లీటర్లు లేదా స్పైనటోరం 11.70 శాతం ఎస్సీ 200 మిల్లీ లీటర్లు లేదా థయమెథొక్సామ్ 12.60శాతంతోపాటు లాంబ్డా సిహలోత్రిన్ 9.50శాతం జెడ్.సి 60 మిల్లీ లీటర్లు లేదా ఐసో సైక్లో సిరం 9.2 డబ్ల్యూ/డబ్ల్యూ డీసీ 10శాతం ఎం/వీ 240 మిల్లీ లీటర్లను ఎకరానికి లేదా సయాంత్రనిలిప్రోల్ 7.3శాతం డబ్ల్యూ/డబ్ల్యూ 8శాతం 80 గ్రాములను లీటర్ నీటిలో కలిపి డయాఫెన్తి యురాన్ 36.4 డబ్ల్యూ/డబ్ల్యూ ఎస్సీ 40శాతం డబ్ల్యూ/వీ 250 మిల్లీ లీటర్లను ఎకరానికి చొప్పున పిచికారీ చేయాలి.

దమ్మున్టే బీసీల ఓట్లు వద్దని చెప్పండి



సభకు హాజరైన ప్రజలు, బీసీ నాయకులు

విల్లు ఎక్కు పెడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

- ఈడబ్ల్యూఎస్ తక్షణమే రద్దు చేయాలి
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- ఆర్ట్స్ కాలేజీలో బీసీ రాజకీయ 'యుద్ధ భేరి' సభ

హన్మకొండ చౌరస్తా: 'మా బీసీలకు మీ ఓట్లు వద్దు.. దమ్మున్టే బీసీల ఓట్లు మీకొద్దని చెప్పండి.. త్వరలో జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు బీఫాంలు, బీసీలకు మధ్య జరుగుతున్న యుద్ధమని' ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఆదివారం జరిగిన 'బీసీ రాజకీయ యుద్ధ భేరి' సభలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెడ్లవి 2వేల ఓట్లుంటే.. బీసీలవి 20వేల ఓట్లున్నాయి.. మరి వారెట్ల గెలుస్తారో చూద్దామన్నారు. కాకతీయ యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు చేపట్టిన రెడ్డి.. అతడి కులస్తుడి కోసం ఓఎస్‌డీ పదవిని కట్టబెట్టారు.. తెలంగాణ మీ జాగీర్ కాదు.. మేము మీకు కౌలుకు ఇస్తే పంటను దొంగలిస్తున్నారు.. ఇక ముందు చూస్తు ఊరుకోమని స్పష్టం చేశారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో బీసీలు నిలబడాలని పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాష్ట్రాన్ని రణరంగం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే మావోయిస్టు, భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్ మాదరి పంథా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఇన్నేళ్లు బీసీలకు సీఎం పదవి రాకుండా తొక్కేశారు.. ఇక నడవదని స్పష్టం చేశారు. 'బీసీ' బంధు పెట్టి ప్రతీ కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో బీసీల వాటా కోసం చేసిన బిల్లును సుప్రీం కొట్టి వేసిందని, మరోసారి ఉద్యమించి ఆ తీర్పు మార్చుకునేలా చేయాలన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఇంకా బిచ్చగాళ్ల మాదిరి అడుక్కునే స్థాయిలోనే ఉన్నారు.. నిన్న కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డిలే కాదు రేపు తీన్మార్ మల్లన్న సీఎం అవుతాడు.. మన బీసీల రాజ్యం రాబోతున్నదని చెప్పారు. కేంద్రంలో బీసీలకు మంత్రి పదవి వచ్చేలా ప్రధానిని కోరాలని ఆర్.కృష్ణయ్యకు సూచించారు. కార్యక్రమంలో బీపీ మండల్ మనవడు ప్రొఫెసర్ సూరజ్ మండల్, తమిళనాడు ఎంపీ విల్సన్, తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ప్రసంగించగా తెలంగాణ ఉద్యమ గాయకులు ఏపూరి సోమన్న, మిట్టపెల్లి సురేందర్, గిద్దెరాం నర్సయ్య, గంగ ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి.

మార్కెట్ పాలకవర్గం మారేనా!

కోడ్ పేరుతో ప్రమాణ స్వీకారం ఆగడంతో వదంతులు
- జెండాలు మోయని, ఇటీవల వచ్చిన వారికి అవకాశాలు
- పార్టీలో అంతర్గత చర్చకు దారి తీస్తున్న నియామకం
- అధికారికంగా జీఓ జారీ నిలిపివేశారని ప్రచారం



ఏనుమాముల మార్కెట్

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్‌గా ప్రియాంకను నియమిస్తూ జారీ చేసిన జీఓ జిరాక్స్ కాపీ ఇప్పుడు పార్టీలో కలకలం రేపుతోంది. మార్కెట్ పాలకమండలిని ఏర్పాటు చేసేందుకు గత నెల 28వ తేదీన సిద్ధం చేసిన జీఓ కాపీని జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి సంబంధిత శాఖ కార్యదర్శి నుంచి తీసుకున్నట్లు తెలిసింది. సదరు కాపీ నాయకుల చేతుల్లో పడిన అనంతరం వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్ చేశారు. దీంతో ఈ పదవి కోసం ముమ్మర యత్నాలు చేస్తున్న వర్ధన్నపేటకు చెందిన సీనియర్ నాయకుడు తన గాడ్ ఫాదర్ దగ్గరకు వెళ్లి జీఓ విషయం ప్రస్తావించినట్లు సమాచారం. ఎమ్మెల్యే టికెట్ ఇవ్వని సమయంలో నామినేటెడ్ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, ఇది ఏమైందని నేతలను ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో గాడ్ ఫాదర్ వెంటనే ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఆశాఖ ఉన్నతాధికారులకు తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ అధికారికంగా జీఓ జారీ చేయొద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుంటే ఇదేనా ఫలితం అంటూ ఆ సీనియర్ నాయకుడు.. నేతల వద్ద వాపోయినట్లు తెలిసింది. మార్కెట్ చైర్‌పర్సన్ పదవి తనకు ఇవ్వాలని లేదా ఇతర పదవి ఇచ్చి తనకు న్యాయం చేసిన అనంతరం మీ ఇష్టం వచ్చిన వారికి ఇవ్వండని ఖరాకండిగా ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ ఘటన జరుగుతున్న నేపథ్యంలో జీఓ అధికారికంగా కోడ్ పేరుతో విడుదల చేయలేదని విశ్వసనీయంగా తెలిసింది. ఏనాడు పార్టీ జెండా మోయని, ఇతర పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే వారికి, ఒక సామాజిక వర్గానికే ఎక్కువగా కమిటీలో సభ్యులుగా అవకాశం ఇవ్వడం లాంటి అంశాలు పార్టీ సెకండ్ క్యాడర్‌లో అసంతృప్తి మొదలైనట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్‌తో పాటు సభ్యుల పేర్లు సైతం మారే అవకాశాలున్నాయనే చర్చ పార్టీలో జరుగుతున్నట్లు తెలిసింది. ఈకమిటీ నియామకంపై తూర్పు నేతలు ఇటీవల ఒక సీనియర్ ఇంట్లో రెండుసార్లు సమావేశం కావడం గమనార్హం. దీంతో మార్కెట్ కమిటీ నియామకంలో భారీగా మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయని సీనియర్ నాయకులు పేర్కొంటున్నారు.

స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ పదవి ఖాళీ

- ముగిసిన ప్రొఫెసర్ వెంకయ్య పదవీకాలం
- సీడీసీడీన్, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా ఎవరో..!

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై వెంకయ్య పదవీ కాలం గత నెల29నముగిసింది. ఐదురోజులు అవుతున్నా స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా ఏ ప్రొఫెసర్‌ను నియమిస్తారనేది ఆసక్తికరంగా మారింది.ఒక వేళ ప్రొఫెసర్ వెంకయ్యనే కొనసాగించాలంటే మళ్లీ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీగా వీసీ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి అప్రూవల్‌మేరకు రిజిస్ట్రార్ నియామక ఉత్తర్వులు జారీచేయాల్సింది. వెంకయ్య పదవి కాలం గత నెల 29నే పూర్తికావడంతో స్పోర్ట్స్‌బోర్డులో బాధ్యతలను నిర్వర్తించడంలేదు. విషయాన్ని అప్పటి రిజిస్ట్రార్ దృష్టికి కూడా తీసుకెళ్లారని సమాచారం.

ఆ రెండు కీలక పదవుల్లో ఎవరో!

కాకతీయ యూనివర్సిటీ సీడీసీ డీన్, దూరవిద్యకేంద్రం డైరెక్టర్, విద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, సైకాలజీ విభాగం అధిపతిగా కొనసాగుతున్న ప్రొఫెసర్ వి.రాంచంద్రం రిజిస్ట్రార్‌గా నియామకమయ్యారు. దీంతో సీడీసీ డీన్ పదవి కోసం ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్, ఎకనామిక్స్ విభాగం అధిపతి, బోర్డుఆఫ్ స్టడీస్ చైర్మన్, కేయూ పాలక మండలి సభ్యులుగా ఉన్న బి.సురేష్‌లాల్ ఆశిస్తున్నారని సమాచారం. ఆ ఇద్దరిలో ఎవరిని ఆ పదవిలో నియమిస్తారనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా కూడా మరో ప్రొఫెసర్‌ను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం యూనివర్సిటీ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య పేర్లు వినబడుతున్నాయి. వీరిలో ఒకరిని దూరవిద్యకేంద్రం డైరెక్టర్‌గా నియమించొచ్చని తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



నాగరాజు(ఫైల్)

చిల్పూరు/పాలకుర్తిటౌన్: చిల్పూరు మండలంలోని వంగాలపల్లి గ్రామ బస్‌స్టేజీ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వంగాల నాగరాజు (28) దుర్మరణం చెందాడు. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాగరాజు రాంగ్ రూట్‌లో ఘన్‌పూర్ వైపునకు వస్తూ ఢీకొన్నాడు. దీంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు. కాగా, నాగరాజు మృతితో బమ్మెరలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే నాగరాజు మృతి చెందాడనే విషయం తెలియగానే కుటుంబీకులతోపాటు గ్రామస్తులు బోరును విలపించారు.

జనగామలో మరో యువకుడు..



విజయ్ (ఫైల్)

జనగామ రూరల్: బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ యవకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన జనగామలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం రెడ్యానాయక్ తండా కు చెందిన ధారావత్ విజయ్ (35) హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఆటోలో స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని నెహ్రూ పార్కు సమీపం బ్రిడ్జిపై ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో విజయ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై చెన్నకేశవులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విజయ్‌కి భార్య నీల, కుమారుడు, కూతురు ఉంది.

కరెంట్ షాక్‌తో సాఫ్ట్‌వేర్ మృతి



శ్రీనివాస్ మృతదేహం

బచ్చన్నపేట : కరెంట్ షాక్‌తో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని పడమటికేశ్వాపూర్ శివారు గ్రామం జెయాల వద్ద జరిగింది. ఎస్సై ఎస్‌కే హమీద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీరాముల శ్రీనివాస్ (48) వర్క్‌ఫ్రమ్ హోమ్ చేస్తున్నాడు. గ్రామంలో మల్బరీ సాగు చేస్తూ ఇక్కడే ఫామ్‌హౌస్‌లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మల్బరీ తోటకు వాడే వాటర్ ఫ్రీజర్‌ను వాటర్ గన్‌తో శుభ్రం చేస్తున్నాడు. ఈ సమయంలో కరెంట్ షాక్ తగిలి బాత్‌రూంలోనే మృతి చెందాడు. పనివాళ్లు వచ్చి చూడగా మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనంతారంలో మరొకరు..

మహబూబాబాద్ రూరల్ : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి అనంతారంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై దీపికారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ సలీం (57) శనివారం రాంసింగ్ తండాకు చెందిన శంకర్ ఇంట్లో మార్బుల్ బండల పని కోసం వెళ్లాడు. పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన ఆ ఇంటి కుటుంబీకులు హుటాహుటిన మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సలీం అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుడు భార్య మోదీన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి కుటుంబీకులకు అప్పగించారు.

కొత్త తరహాలో చైన్ స్నాచింగ్!

- మహిళా నిర్వాహకులు ఉన్న కిరాణాషాపులే టార్గెట్
- ఇప్పటికీ మూడు ప్రాంతాల్లో చోరీలు
- నిందితుల కోసం పోలీసుల గాలింపు

హసన్‌పర్తి: చైన్‌స్నాచర్లు గతంలో కాలినడన వెళ్లే మహిళల మెడలో నుంచి చైన్ స్నాచింగ్‌కు పాల్పడేవారు. ప్రస్తుతం కొత్త తరహాలో చైన్‌స్నానింగ్‌కు తెరలేపారు. ముఖ్యంగా కిరాణాషాపులు టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ఆ షాపులో మహిళాలు కౌంటర్‌పై ఉండే సమయాన్ని ఎంచుకుంటూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. ఇలా హనుమకొండ జిల్లాలోని మూడు ప్రాంతాల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి.

బైక్‌పై వచ్చి..

ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి ఈ ఘటనకు పాల్పడుతున్నట్లు బాధితులు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. మహిళలు కౌంటర్‌పై ఉన్న షాపులోకి ఓ యువకుడు వచ్చి సరుకులు ఖరీదుకు ఉపక్రమిస్తున్నాడు. అవకాశం లభించగానే ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు, చైన్‌ను లాక్కెళ్తున్నాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల వద్ద గత నెల 13వ తేదీన ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చారు. రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఓ యువకుడు షాపుకు వచ్చి సరుకులు ఖరీదుచేస్తూ అవకాశం కోసం చూసి షాపు నిర్వాహకురాలు శ్రీలత మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడు లాక్కెళ్లాడు. అలాగే, ఇటీవల గోపాలపురం ప్రాంతంలో ఇదే విధంగా కిరాణా షాపుకు వచ్చి పెరుగు ప్యాకెట్ అడుగుతూ షాపు నిర్వాహకురాలి మెడలో నుంచి చైన్ లాగాడు. బాధితురాలు కేకలు వేయడంతో యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలు ఆయా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. తాజాగా హనుకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిలోని బాహుపేట క్రాస్ వద్ద ఓ కిరాణా షాపుకు వచ్చిన యువకుడు బిర్యానీ మసాల అడుగుతూ షాపు నిర్వాహకురాలు మెడలో నుంచి సుమారు నాలుగు తులాల చైన్ లాక్కెళ్లాడు.

సీసీ కెమెరాలో దృశ్యాలు నిక్షిప్తం

షాపునకు వచ్చి చైన్ లాక్కెళ్తున్న యువకుడి దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. ఈమేరకు బాధితురాలి నుంచి పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. నిందితులను పట్టుకోవడానికి సివిల్, టాస్క్‌ఫోర్స్‌తోపాటు సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు.



చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితుడు (సీసీ ఫుటేజీ)

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ హఠాన్మరణం



సోమేశ్వర్ (ఫైల్)

డోర్నకల్ : డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పోలోజు సోమేశ్వర్ (52) గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. శనివారం రాత్రి విధులు నిర్వహిస్తున్న సోమేశ్వర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో సీఐ రాజేశ్, సిబ్బంది హుటాహుటిన సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పీహెచ్‌సీ సిబ్బంది ప్రాథమిక వైద్యం నిర్వహించిన అనంతరం 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అందరితో ఆత్మీయంగా ఉండే సోమేశ్వర్ మృతి చెందాడనే వార్త తెలుసుకున్న స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతదేహాన్ని స్వగ్రామం దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. సోమేశ్వర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

వరంగల్ : వరంగల్ ఎల్బీనగర్ గణేశ్‌నగర్‌కు చెందిన కట్కూరి ఐలయ్య (66) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు రంజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇంతేజార్ గంజ్ ఎస్సై సందీప్ తెలిపారు. ఐలయ్య ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

విడాకులు ఇప్పించాలని భార్య ఆందోళన



భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మానస

కురవి: తనకు విడాకులు ఇప్పించాలని కోరుతూ మండలంలోని రాజోలు గ్రామంలో భార్య ఆదివారం భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాళం వెంకన్న కూతురు మానస అదే గ్రామానికి చెందిన గునిగంటి చంద్రమౌళి, భద్రమ్మ దంపతుల కుమారుడు సురేందర్ 2022లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే ఇద్దరి మధ్య పొరపొచ్చాలు వచ్చాయి. తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో తనకు విడాకులు ఇప్పించాలని కోరుతూ భర్త ఇంటి ఎదుట మానస ఆందోళన చేపట్టింది.

నేడు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్

- 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి



కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన రిటర్నింగ్ ఆఫీసర్ బోర్డు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లోని ఆర్‌ఓ కార్యాలయంలో స్వీకరించనున్నారు.

కలెక్టరేట్ వద్ద బారికేడ్లు ఏర్పాటు..

ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణకు అవకాశం ఉంటుంది. 11న నామినేషన్ల పరిశీలిస్తారు. 13న సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు. 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, మార్చి 3వ తేదీన ఓట్లు లెక్కిస్తారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే నల్లగొండ కలెక్టరేట్ బయట వంద మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు..

నామినేషన్లు సమర్పించేందుకు వచ్చే అభ్యర్థుల సందేహాలను నివృతి చేసేందుకు నామినేషన్ల స్వీకరణ హాల్ ఎదుట హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. నామినేషన్ ఫామ్ పూరించడంలో ఎలాంటి సందేహాలున్నా సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకోవచ్చు.

నిబంధనలు ఇలా..

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లు సమర్పించే వారు జనరల్ అభ్యర్థి అయితే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి.
- ఎమ్మెల్సీకి పోటీ చేసే వ్యక్తి తెలంగాణలో జనరల్ ఓటరై ఉండాలి. రాష్ట్రంలోని ఏ జిల్లాలో కూడా ఎమ్మెల్సీ ఓటు హక్కు లేకపోతే పోటీకి అనర్హుడు.
- నామినేషన్ సమర్పించే అభ్యర్థికి పది మంది ప్రపోజల్స్ సంతకాలు చేయాల్సి ఉంటుంది. వారంతా వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఈ మూడు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరై ఉండాలి.